

నూతన ధ్వజస్తంభం ఏర్పాటుకు
చురుగ్గా సన్నాహాలు
» అన్నవరంలో నేటి నుంచి నవమి వేడుకలు
లోవలో పంచలోహ విగ్రహాల పునఃప్రతిష్ఠ

ముప్పని తెలిసీ.. ముంచేశారు



కొత్తపల్లి మండలం కొమరగిరిలో ఇళ్లకు అతి సమీపంగా వచ్చేసిన సముద్రం నీరు

» ఇళ్ల స్థలాల పేరుతో కాకినాడ సిటీలో పేదలను నిలువునా ముంచేసిన జగన్ ప్రభుత్వం
» 13,500 మంది లబ్ధిదారులకు కాకినాడ కాదని యు.కొత్తపల్లి కొమరగిరిలో స్థలాలు
» ఇప్పుడా లేఅవుట్‌కు తరచూ సముద్ర జలాల పోటు ముప్పు
» ఇటీవల సముద్రం పోటుకు లేఅవుట్‌లో ఇళ్లకు సమీపంగా వచ్చేసిన సముద్రం
» బెంబేలెతిపోతున్న లబ్ధిదారులు: ఏక్షణాన ఏమవుతుందోనని బిక్కుబిక్కు
» మున్ముందు స్థలాలు, ఇళ్లు ఉప్పు నీటిలో మునిగిపోతాయని కలవరం
» తీరానికి ఆనుకుని ఉండడంతో భారీగాలుల భయంతో ఇళ్ల నిర్మాణానికి పేదల అనాసక్తి
» మొత్తం 13,500 ఇళ్లకు ఇప్పటివరకు పూర్తయినవి 180
» సీఎం జగన్ రాష్ట్రంలో తొలిసారి ప్రారంభించిన లేఅవుట్ నవ్వులపాలు
» పేదల ఇళ్లస్థలాల కొనుగోలు, చదును పేరుతో రూ.60కోట్లకుపైగా మెక్కేసిన నేతలు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)/కొత్తపల్లి

ఇళ్లస్థలాల పేరుతో కాకినాడ సిటీ నియోజకవర్గ పేదలను జగన్ ప్రభుత్వం నిలువునా వంచించిన తీరు బట్టబయలవుతోంది. స్థలాల కొరత సాకుతో 13,500మందికి ఎక్కడో దూరంగా ఉన్న యు.కొత్తపల్లి మండలం కొమరగిరిలో పట్టాలు ఇచ్చేసి చేతులు దులిపేసుకోవడం ఎంత తప్పిదమో బయటపడుతోంది. ఇక్కడ పట్టాలిచ్చి పేదలకు చేసిన మేలు కంటే కీడే ఎక్కువనే నిజాలు నిలకడపై తేలుతున్నాయి. పేదల ఇళ్లస్థలాల ముసుగులో కాకినాడ వైసీపీ కీలక నేత నొక్కేసిన కోట్ల భాగోతం సముద్రం సాక్షిగా ఇప్పుడు వెలుగులోకి వస్తోంది. ఏకంగా ఇక్కడ లేఅవుట్‌కు సముద్రంపోటు ముప్పు పెరగడంతో లబ్ధిదారులు వణికిపోతున్నారు. కట్టిన ఇళ్లల్లో బిక్కుబిక్కుమంటున్నారు. ఇంకా కట్టనివాళ్లు లేఅవుట్ ఊసెత్తితేనే ఉలిక్కిపడుతున్నారు. తాజాగా సముద్రం పోటుకు నీళ్లు ఏకంగా ఈలేఅవుట్ స్థలాలు, ఇళ్లకు సమీపంగా రావడంతో బెంబేలెత్తిపోతు న్నారు. మున్ముందు సముద్ర జలాల్లో లేఅవుట్ ఎక్కడ మునిగి పోతుందోనని తల్లుకుని వణికిపోతున్నారు. ఉప్పు నీటిలో స్థలాలు, ఇళ్లు నానితే ఎందుకూ పనికిరావని ఆందోళన చెందుతున్నారు. మరోపక్క రాష్ట్రంలోనే తొలిసారిగా పేదల ఇళ్ల స్థలాల లేఅవుట్‌ను సీఎం జగన్ ఇక్కడినుంచే ప్రారంభించించగా ఇప్పుడు దీనికి సముద్రం పోటు ముప్పు పెరగడం ప్రభుత్వాన్ని నవ్వులపాలయ్యేలా చేస్తోంది.

వైసీపీ కీలక నేత స్కెచ్

పేదలందరికీ ఇళ్లపథకంలో భాగంగా జగన్ ప్రభుత్వం 2020లో కాకినాడ సిటీ నియోజకవర్గంలో లబ్దిదారులను గుర్తించింది. దాదాపు 25 వార్డుల్లో 16వేల మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు అవసరమని తేల్చింది. వీరికి పట్టాల పంపిణీకి వందల ఎకరాలు అవసరం కాగా, ప్రభుత్వ భూమి లేకపోవడంతో ప్రైవేటు భూములు కొనాల్సి వచ్చింది. ఇందుకు కోట్లలో ఖర్చవుతుందని ప్రభుత్వం గుడ్లు తేలేసింది. దీంతో సదరు కాకినాడ వైసీపీ కీలక నేత స్కెచ్‌లో భాగంగా అధికారులు ఎక్కడో దూరంగా పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని యు.కొత్తపల్లి మండలం కొమరగిరిలో భూములు సేకరించాలని ప్రతిపాదించారు. ఇవి సముద్ర తీరానికి అతి సమీపంగా ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోలేదు.భవిష్యత్తులో సముద్రం పోటు ముప్పు, తుఫాన్ల సమయంలో పెనుగాలులు వీస్తాయని తెలిసినా ఈ భూములను సేకరించారు.

సముద్రం ముంచేస్తోంది

ఒకపక్క సముద్రం.. చెంతనే ఇళ్లస్థలాలు.. ఇంత ఖరీదైన భూములు తమ ప్రభుత్వం కాబట్టే పేదలకుఇచ్చిందంటూ సీఎం జగన్ నుంచి కాకినాడ సిటీ వైసీపీ ఎమ్మెల్యే ద్వారం పూడి వరకు అదేపనిగా ఊదరగొట్టారు. కానీ క్షేత్రస్థాయిలో ఇక్కడ లేఅవుట్ నిర్మించి పేదలకు స్థలాలు ఇవ్వడం ఎంత ప్రమాదకరమో ప్రతి ఒక్కరికీ అర్థమవుతోంది. పేరుకు పక్కనే బీచ్ ఉన్నా తరచూ సముద్రం పోటు ప్రభావంతో లేఅవుట్ స్థలాల వరకు నీరు వచ్చేస్తోంది. ఈదురుగాలులు, అలల తీవ్రతకు సముద్రం ఉప్పాడ బీచ్‌రోడ్డును దాటేసి లేఅవుట్ ఇళ్ల వరకు ఉప్పు నీళ్లు ముంచేస్తున్నాయి. తాజాగా సముద్రం పోటు ప్రభావంతో భారీగా సముద్రజలాలు ఇళ్ల స్థలాలను తాకాయి. కొన్ని ఇళ్లకు అతి సమీపంగా ఈ నీళ్లు వచ్చేశాయి. దీంతో ఇప్పుడక్కడ చూస్తే పోటుతో వచ్చిన సముద్రం నీరుతో ఇళ్లస్థలాలు ఎప్పుడు మునిగిపోతాయో అన్నట్లు ఉంది. వాస్తవానికి లేఅవుట్ వెళ్లేందుకు ఎత్తుగా నిర్మించిన రహదారి అడ్డుగా ఉండడంతో కొంత ప్రాంతం సముద్రం నీరుకు దూరంగా ఉంది. లేకపోతే మరిన్ని ఇళ్లస్థలాలు ఉప్పునీటిలో మునిగిపోయి ఉండేవి. ఇదే కాదు.. తరచూ సముద్రం పోటు ప్రభావంతో స్థలాల్లోకి నీళ్లు వచ్చేస్తుండడంతో పేదలు భయపడుతున్నారు. ఏక్షణం సముద్రం పోటుతో ఇళ్లల్లోకి నీళ్లు వచ్చేస్తాయోనని బిక్కుబిక్కుమంటున్నారు. రాత్రివేళల్లో అయితే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నారు. అసలే ఉప్పు నీరు కావడంతో గోడలు, ఇళ్లు ఎందుకు పనికి రావని ఆందోళన చెందుతున్నారు. అటు ఖాళీగా ఉన్న పునాదుల్లోకి ఉప్పు నీరు వస్తుండడంతో అవెందుకూ పనికిరావేమోనని పేదలు లేఅవుట్‌వైపు కూడా చూడడం లేదు. తుఫాన్ల సమయంలో తీరం వెంబడి బలమైన ఈదురుగాలుల శబ్దంతో ఇక్కడ నివాసం ఉంటున్న వారు బెంబేలెత్తుతున్నారు. కొందరైతే తట్టాబుట్టా సర్దుకుని వెళ్లిపోయారు. ఇలా ఎప్పటికప్పుడు సముద్రం ముప్పు పెరుగుతుండడంతో సీఎం జగన్ ప్రారంభించిన లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు రావడం లేదు. కష్టమైనా కాకినాడలోనే అద్దె ఇళ్లల్లో ఉంటున్నారు. కానీ వీరికి స్థలాలు ఇచ్చే పేరుతో సదరు కాకినాడ సిటీ వైసీపీ కీలక నేత మాత్రం స్థలాల కొనుగోలు, లేఅవుట్ చదును పేరుతో ఎన్ని కోట్లు తిన్నారో లెక్కలేదు.

పేదల కంటే పెద్దలకే లబ్ధి..

పేదల ఇళ్లస్థలాల ముసుగులో ఇక్కడ 365ఎకరాలు ప్రైవేటు భూములు గుర్తించారు. ఎకరం రూ.25లక్షల వరకు ఉండగా, సదరు కీలక నేత ముందుగానే తక్కువ ధరకు బినామీలతో భూములు కొనిపించారు. ఆ తర్వాత ప్రభుత్వానికి ఎకరాకు రూ.41లక్షల చొప్పున అంటగట్టారు. రూ.145కోట్లకుపైగా అయిన భూసేకరణ ఖర్చులో కోట్లలో కొట్టేశారు. 2020, డిసెంబర్ 25న సీఎం జగన్ ఈ 365 ఎకరాల కొమరగిరి లేఅవుట్‌ను ప్రారంభించారు. 13,500మందికిపైగా కాకినాడ సిటీ నియోజకవర్గ లబ్ధిదారులకు పట్టాలు పంచారు. ఇది జరిగి నాలుగేళ్లవుతున్నా ఇంతవరకు ఇక్కడ పూర్తయిన ఇళ్లు కేవలం 180 మాత్రమే. దీన్నిబట్టి ఇక్కడ లేఅవుట్‌లో పేదలు ఇళ్లు కట్టుకోవడానికి ఎంత అనాసక్తిగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. ఇళ్లు నిర్మించుకోకపోతే పట్టాలు రద్దు చేస్తామని అనేక సార్లు అధికారులు బెదిరించినా లబ్ధిదారులు ఇళ్లు కట్టడానికి ముందుకు రాలేదు. దీంతో సీఎం జగన్ స్వయంగా రాష్ట్రంలో తొలిసారిగా ప్రారంభించిన పేదల ఇళ్లస్థలాల లేఅవుట్ నవ్వుల పాలైంది. ప్రస్తుతం ఇక్కడ 5వేల ఇళ్లు పునాదుల స్థాయిలో ఆగిపోయాయి. 800శ్లాబ్‌దశలో నిలిచిపోయాయి. 150ఇళ్లు లింటల్, 4వేల ఇళ్లు ప్లింత్ దశలో కొన్నేళ్లుగా పడకేశాయి. ఒకరకంగా చెప్పాలంటే ఈలేవుట్‌లో ఇళ్లనిర్మాణానికి కాకినాడ సిటీ నియోజకవర్గ పరిధిలోని పేదలు అసలే మాత్రం ఆసక్తి చూపడం లేదు. కానీ ఇళ్ల నిర్మాణం పూర్తయిపోతుందనే గుడ్డి నమ్మకంతో జగన్ సర్కారు రూ.35కోట్లు వెచ్చించి రహదారులు, విద్యుత్ వసతి తదితర సౌకర్యాలు కల్పించింది. కానీ లబ్ధిదారులు మాత్రం ఇళ్ల నిర్మాణానికి భయపడిపోతున్నారు.

నామినేషన్ల స్వీకరణకు సర్వం సిద్ధం



» 18 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం
» అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు ఆర్వో కార్యాలయాల్లో, పార్లమెంట్ అభ్యర్థులు కలెక్టరేట్‌లో నామినేషన్లు
» 25వతేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
» 26న నామినేషన్ల స్ర్కూటినీ
» 29 వరకు ఉపసంహరణకు గడువు
» మే 13న పోలింగ్
» జిల్లా కలెక్టర్ జె.నివాస్

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 15: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈనెల 18వతేదీనుంచి జిల్లా వ్యాప్తంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని జిల్లా కలెక్టర్ జె.నివాస్ వెల్లడించారు. సోమవారం ఆయన ఒక ప్రకటన వెలువరించారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఆయా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో నామినేషన్లు దాఖలు చేయాలన్నారు. కాకినాడ లోక్‌సభ నియోజకవర్గానికి జిల్లా కలెక్టరేట్‌లో ఆర్వో కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. ఈనెల 18 నుంచి 25 వరకు ప్రభుత్వ సెలవులు మినహాయించి మిగిలిన అన్ని రోజుల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. ఈనెల 26న నామినేషన్ల స్ర్కూటినీ నిర్వహిస్తామన్నారు. ఈనెల 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఇచ్చామన్నారు. ఉపసంహరణ అనంతరం పోటీలో నిలిచే అభ్యర్థులను ఫారం-7 ద్వారా ప్రకటిస్తామన్నారు. మే 12న పోలింగ్ సిబ్బందికి ఈవీఎంలు, వీవీప్యాట్లు, స్టేషనరీ అందజేస్తామన్నారు. మే 13న పోలింగ్ జరుగుతుందన్నారు.

జిల్లాలో ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి

జిల్లాలో ఓటింగ్‌శాతం పెంచేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ నివాస్ తెలిపారు. ఎపిక్ కార్డుతోపాటు 12 రకాల గుర్తింపు కార్డులను చూపించి ఓటుహక్కు వినియోగించుకోవచ్చునన్నారు. ఈసీఐ గుర్తింపు పత్రాలు ఉన్న పాత్రికేయులు కూడా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు అవకాశం ఉందన్నారు. ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాలకు ఏర్పాట్లు చేశామన్నారు. జనం రద్దీగా ఉన్న బస్టాండ్, రైల్వేస్టేషన్లలో ఓటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

రికార్డుస్థాయిలో రూ.17కోట్ల30లక్షల సొత్తు స్వాధీనం

» నెలరోజుల వ్యవధిలో దొరికిన మొత్తమిది.. నగదుతోపాటు మద్యం, మాదక ద్రవ్యాలు

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 15: జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటినుంచి నెలరోజుల వ్యవధిలో స్క్వాడ్లు నిర్వహించిన తనిఖీల్లో రూ.17కోట్ల30లక్షల విలువైన సొత్తును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనిలో ప్రధానంగా నగదు, మద్యం, మాదక ద్రవ్యాలు, వెండి, బంగారం ఉన్నాయి. జిల్లాలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు, ఫ్లైయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వేలైన్ బృందాలు నిత్యం తనిఖీలతో జల్లెడపడుతున్నాయి. జిల్లాలో ఉన్న చెక్‌పోస్టులతోపాటు ప్రధాన కూడళ్లలో వాహన తనిఖీలను ముమ్మరం చేశాయి. దీంతో పెద్దఎత్తున నగదు, మద్యం స్వాధీనం పట్టుబడుతున్నాయి. జిల్లాలో ఎన్నికల బృందాలు నిత్యం తనిఖీలు చేస్తున్నా బరిలో నిలుస్తున్న అభ్యర్థుల తీరు మారడంలేదు. నగదు, మద్యం, చీరలు, వెండి, బంగార అభరణాలు తరలింపు కొనసాగుతుంది.

రూ.50వేలు మించితే ఆధారాలు చూపించాలి: కలెక్టర్ జె.నివాస్

జిల్లాలో ఎవరైనా రూ.50వేల కంటే ఎక్కువగా నగదు తీసుకెళ్తుంటే తప్పనిసరిగా ఆధారాలు చూపించాలి. ఎన్నికల నియమావళిని అనుసరించి నగదు తీసుకెళ్లాలి. ఇతర సామాగ్రి, వస్తువులను తీసుకెళ్లే సమయంలో కూడా బిల్లులు చూపించడంతోపాటు ఎక్కడికి తరలిస్తున్నారో సరైన సమాచారమివ్వాలి.



పిఠాపురంలోని పాదగయ క్షేత్రం వద్ద నిరసన తెలుపుతున్న హిందూ సంఘాలు, బ్రాహ్మణ, అర్చక సంఘాల ప్రతినిధులు

ఏకపక్షంగా పూజా రుసుములు పెంచుతారా?

» పాదగయవద్ద హిందూ సంఘాలు, అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళన
» పెంపు విరమించుకుంటున్నామని ఈవో వెల్లడి
» ఆంధ్రజ్యోతి కథనంపై దేవదాయశాఖ కమిషనర్ ఆరా

పిఠాపురం, ఏప్రిల్ 15: దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో పూజలు, సేవలు, ఇతర కైంకర్యాలు, పిండప్రదానాల రుసుములను పెంచడంపై హిందూ సంఘాల ప్రతినిధులు, అఖిలపక్ష ప్రతినిధులు భగ్గుమన్నారు. విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్, బ్రాహ్మణ, అర్చక, పురోహిత సంఘాల ప్రతినిధులు, జనసేన, బీజేపీ నాయకులు సోమవారం పాదగయ క్షేత్రంవద్ద ఆందోళనకు దిగారు. భక్తులకు సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పించడంలో శ్రద్ధ వహించకుండా అన్ని రకాల రుసుములను 100నుంచి 300శాతం పెంచడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిండప్రదానాలతోపాటు స్వయంభూ కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, అష్టాదశశక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్టాన దేవతైన పురుహుతికా అమ్మవారిని దర్శించుకునేందుకు దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి భక్తులు భారీగా తరలివస్తూ ఉంటారని, అటువంటి వారికి సేవలు, పూజలు అందుబాటులో లేకుండా ధరలు పెంచితే ఎలా అని నిలదీశారు. భక్తులు రాక తగ్గిపోతే బ్రాహ్మణులు ఎలా జీవనం సాగించాలన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్న పెంపు నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని వారు ఈవో పులినారాయణమూర్తికి వినతిపత్రం అందజేశారు. భక్తులు, అర్చకులు, ఇతరుల సలహాలు తీసుకోకుండా ఏకపక్షంగా పెంపు నిర్ణయం తీసుకోవడం ఏంటని ప్రశ్నించారు.

దేవదాయశాఖ కమిషనర్ ఆరా

పాదగయలో పూజలు, సేవలు, పిండప్రదానాలు సహా అన్ని రకాల రుసుములు, అద్దెలు పెంచాలన్న నిర్ణయంపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై దేవదాయశాఖ కమిషనరు సత్యనారాయణ ఆ శాఖ అధికారులను ఆరా తీశారు. జిల్లా కలెక్టరు నివాస్ ఈ వ్యవహారంపై నివేదిక ఇవ్వాలని దేవదాయశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. మరోవైపు పట్టణానికి చెందిన పలువురు ఏకపక్షంగా అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ కమిషనర్‌కు ఆంధ్రజ్యోతి కథనం జతచేసి వాట్సాప్, మెయిల్ ద్వారా వినతిపత్రాలు పంపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఇటువంటి నిర్ణయం తీసుకోవడం తగదని వారు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఉన్నతాధికారులు ఈ విషయంపై ఆరా తీయడంతోపాటు దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని సూచించారు. మరోవైపు హిందూ, అర్చక, బ్రాహ్మణ సంఘాల ఆందోళనతో పెంపు ప్రతిపాదనలను వెనక్కి తీసుకుంటున్నట్లు ఈవో పులి నారాయణమూర్తి తెలిపారు. 2015 నుంచి ధరలు పెంచనందు వల్ల, మరోపక్క ఆదాయం పెరిగితే ఆలయం అభివృద్ధి చెందుతుందని భావించి ఉన్నతాధికారులకు సూచనల మేరకు అభ్యంతరాలు కోరినట్లు వివరించారు. అందరూ వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు తెలిపారు.

నిలిచిన ఫిషింగ్ బోట్లు



కాకినాడ-జగన్నాథపురం ఉప్పుటేరులో నిలిపివేసిన ఫిషింగ్ బోట్లు

» అమలులోకి వచ్చిన చేపల వేట నిషేధం
» 4,600 బోట్లకు అందనున్న నష్టపరిహారం
» కోడ్ నేపథ్యంలో అర్హుల గుర్తింపు ఆలస్యం

కాకినాడ సిటీ, ఏప్రిల్ 15: సముద్ర జలాల్లో చేపలవేట నిషేధం అమలులోకి రావడంతో జిల్లావ్యాప్తంగా ఫిషింగ్ బోట్లు నిలిచిపోయాయి. ఈనెల 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజుల పాటు అమలు కానున్న ఈ నిషేధం ఆదివారం అర్ధరాత్రి నుంచి అమలులోకి వచ్చింది. దీంతో కాకినాడ జిల్లాలో ఆరు మండలాల పరిధిలో ఎక్కడికక్కడ బోట్లు నిలిచివేశారు. జిల్లాలోని తొండంగి, యు.కొత్తపల్లి, కాకినాడ రూరల్, కాకినాడ అర్బన్, తాళ్లరేవు, కరప మండలాల పరిధిలో 4,600 ఫిషింగ్ బోట్లు ఉన్నట్లు మత్స్యశాఖ అధికారులు అంచనా వేశారు. ఈ బోట్లలో 350 మెకనైజ్‌డ్(పెద్ద సైజు), 4,250 మోటరైజ్‌డ్ (సాధారణ సైజు) ఉండగా, వీటిపై 24 వేలమంది సముద్ర జలాల్లో చేపల వేట సాగిస్తున్నారు. మెకనైజ్‌డ్ బోటుపై ఆరుగురికి, మోటరైజ్‌డ్ బోటుపై 8మందికి వేట విరామ నష్టపరిహారం అందించనున్నారు. ఫిషింగ్ బోట్లపై జీవనోపాధి పొందే మత్స్యకారులకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున అందించే ఈ పరిహారం నిమిత్తం ప్రతిఏటా మాదిరిగానే ఈనెల 17 లేదా 18 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో జరిగి అర్హుల గుర్తింపు ఈసారి ఆలస్యం కానుంది. సార్వత్రిక ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇంతవరకు ఎటువంటి సర్క్యులర్ రాకపోవడంతో మత్స్యశాఖ అధికారులు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సముద్ర జలాల్లో యాంత్రిక పడవలు (మెకనైజ్‌డ్, మోటరైజ్‌డ్) ద్వారా అన్ని రకాల చేపల వేటను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 3న ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను రాష్ట్ర పశుసంవర్థకశాఖ, డెయిరీ డెవలప్‌మెంట్, మత్స్యశాఖ జీవో ఆర్‌టీ నెంబర్ 81లో పొందుపరిచింది. వివిధ చేపలు, రొయ్యల జాతుల సంతానోత్పత్తి కాలంలో తల్లి చేపలు, తల్లి రొయ్యలను సంరక్షించడం, వారి సంతతి పెరుగుదలను ప్రోత్సహించడం, తద్వారా సముద్ర మత్స్య సంపద సుస్థిరతను సాధించడం ముఖ్య ఉద్దేశ్యంగా సముద్ర జలాల్లో చేపలవేట నిషేధం అమలవుతోంది. 61రోజులపాటు ఈ నిషేధ కాలాన్ని కచ్చితంగా అమలు చేసేందుకు మత్స్యశాఖ అధికారులు కోస్ట్‌గార్డ్, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, నేవీ, రెవెన్యూ అధికారుల సహకారంతో గస్తీ నిర్వహించనున్నారు. నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘించి చేపలవేట సాగించే బోట్ల యజమానులను ఆంధ్రప్రదేశ్ సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టం 1994, సెక్షన్(4) ప్రకారం శిక్షించడంతోపాటు మత్స్య సంపద స్వాధీనం చేసుకుని భారీ జరిమానా విధించనున్నారు. ఫిషింగ్ బోట్లకు రాష్ట్ర ప్రభుత్వం అందించే డీజిల్ ఆయిల్ సబ్సిడీ, ఇతరత్రా సబ్సిడీ సదుపాయాలను నిలిపివేయనున్నారు. సముద్రజలాల్లో చేపలవేట నిషేధ కాలం కచ్చితంగా అమలయ్యేందుకు జిల్లాలోని మత్స్యకారులందరూ సహకరించాలని మత్స్యశాఖ జేడీ కరుణాకరరావు విజ్ఞప్తి చేశారు.

ఓటు విలువను తెలియజేసే ఫ్లెక్సీ బోర్డులు

» నియోజకవర్గాల్లో వేలాది ఫ్లెక్సీ బోర్డులు
» ఎన్నికల సంఘం ఆదేశాలతో ఏర్పాటు



కాకినాడలో ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బోర్డులు

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 15: ప్రజాస్వామ్యంలో వజ్రాయుధం వంటి ఓటు విలువను తెలియజేసేలా అధికార యంత్రాంగం జిల్లావ్యాప్తంగా వేలాది ఫ్లెక్సీలను ఏర్పాటు చేసింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల అధికారులు స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వీటిపై 2024 లోక్‌సభ, శాసనసభ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, ఓటు వేయడం మన హక్కునని ముద్రించారు. యువత మేల్కొనండి.. చైతన్యవంతమైన ప్రజాస్వామ్యంకోసం తప్పనిసరిగా ఓటుహక్కు వినియోగించుకోవాలని ముద్రించారు. దృఢమైన ప్రజాస్వామ్యానికై ఆగిపోలేదు, అలిసిపోలేదు ఓటు వేయడానికి వెళ్తున్నాం అనే శీర్షికలతో ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. జిల్లాలో ఉన్న నగరాలతోపాటు పట్టణాలు, గ్రామాల్లో వీటిని వేలాది సంఖ్యలో ఏర్పాటు చేశారు. జిల్లావాసులు వీటిని క్షణంగా చదివి ఓటు విలువను తెలుసుకుంటున్నారు. 2024, జనవరి 1వతేదీ నాటికి 18ఏళ్లు నిండి ఓటు నమోదు చేసుకున్న వారందరూ ఓటుహక్కు వినియోగించుకుని మెరుగైన ప్రజాస్వామ్యం నిర్మించుకోవాలని ప్రజాస్వామ్యవాదులు పిలుపునిస్తున్నారు. పోలింగ్‌కు ఇంకా 28 రోజులు మాత్రమే ఉండడంతో జిల్లాలో పెద్ద ఎత్తున ఓటుపై అవగాహన కార్యక్రమాలను జిల్లా అధికార యంత్రాంగం నిర్వహిస్తోంది. దీనిలో భాగంగానే విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు, ఫ్లెక్సీల ఏర్పాటు, బస్టాండ్, రైల్వేస్టేషన్లలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.



కార్యక్రమానికి హాజరైన జనసేన క్రియాశీలక వలంటీర్లు, కార్యకర్తలు, నాయకులు



మాట్లాడుతున్న నాగబాబు

క్రియాశీలక వలంటీర్ల కృషి గొప్పది

» జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు » పార్టీలో పలువురి చేరిక

పిఠాపురం, ఏప్రిల్ 15: క్రియాశీలక వాలంటీర్ల కృషి గొప్పదని, పిఠాపురంలోనే పదివేలమందికిపైగా క్రియాశీలక సభ్యత్వాలు నమోదు కావడం గుర్తించదగిన అంశమని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు అన్నారు. జనసేన ఐటీ విభాగం నాయకుడు పెన్నమరెడ్డి నాగబాబు ఆధ్వర్యంలో సోమవారం పిఠాపురంలో జరిగిన క్రియాశీలక వలంటీర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో క్రియాశీలక వలంటీర్ల పాత్ర కీలకమని, కొత్తగా ఓటు నమోదు చేసుకున్నవారిని చైతన్యం చేసేవిధంగా కృషిచేయాలన్నారు. పార్టీ జాతీయ మీడియా ప్రతినిధి వేములపాటి అజయ్ పాల్గొన్నారు. పిఠాపురం నియోజకవర్గంలో మత్స్యకార విభాగం అధ్యక్షుడు మల్లాడి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంక కొండబాబు ఆధ్వర్యంలో మత్స్యకార కుటుంబాలు జనసేనలో చేరారు. పిఠాపురం నియోజకవర్గంలోని ఇతర పార్టీల నాయకులు, మహిళలు, యువకులు డాక్టర్ పిల్లా శ్రీధర్ ఆధ్వర్యంలో జనసేనలో చేరగా నాగబాబు కండువాలు కప్పి ఆహ్వానించారు.

నూతన ధ్వజస్తంభం ఏర్పాటుకు చురుగ్గా సన్నాహాలు


ధ్వజస్తంభం తయారీ చేస్తున్న దృశ్యం

అన్నవరం, ఏప్రిల్ 15: రత్నగిరి వాసుడైన సత్యదేవుడి ఆలయ నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే ధ్వజస్తంభ కర్రను అనివేటి మండపం వద్దకు చేర్చగా సోమవారం నుంచి అడుగు భాగంలో రాగిరేకును అమర్చే పనులు చేపట్టారు. 5 అడుగులు మేర భూమి లోపల ఉండే ఈ కర్రకు ముందు రాగిరేకు అమర్చి ధ్వజస్తంభ ప్రతిష్ఠ అనంతరం మిగిలిన సుమారు 60 అడుగులకు రాగిరేకు దానిపై బంగారుపూతను అమర్చనున్నారు. దీనికి సుమారు 4 కోట్లు వ్యయం అవుతుంది. వైదిక కార్యక్రమాల నిర్వహణకు రావిచెట్టు ప్రాంగణంలో యాగాల నిర్వహణకు నూతన పందిరిని నిర్మించారు. 5 రోజుల పాటు జరిగే యాగములు, హోమములు, జపములు, ఇతర వైదికకార్యక్రమాలను ఈ యాగశాలలో నిర్వహిస్తారు. ఈనెల 18న ఉదయం 11 గంటలకు గణపతిపూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ తదితర కార్యక్రమాలు అనంతరం తొలిరోజున నూతన ధ్వజస్తంభంకు జలాధివాసం, రెండో రోజున క్షీరాధివాసం, మూడో రోజున పుష్పాధివాసం, నాలుగో రోజున ధాన్యాధివాసంలో ఉంచి 22న ఉదయం కళాన్యాసము, శయ్యాధివాసం హోమ పూర్ణాహుతి అనంతరం ఉదయం 10.48కి ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేపట్టనున్నారు.

నేటి నుంచి నవమి వేడుకలు

అన్నవరం, ఏప్రిల్ 15: సత్యదేవుడి ఆలయ క్షేత్ర పాలకులుగా పూజలందుకుంటున్న రత్నగిరి రామయ్య దివ్య కల్యాణోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. సాయంత్రం 4 గంటలకు రామాలయ ప్రాంగణంలో పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా అలంకరించనున్నారు. 17 ఉదయం 6 గంటలకు ధ్వజారోహణం, అంకురార్పణ, సీతారాములను వెండి ఆంజనేయవాహనంపై గ్రామోత్సవం నిర్వహించి ఉదయం 9.30కి సత్యదేవుడి వార్షిక కల్యాణ వేదికపై శ్రీరామనవమి సీతారాముల దివ్యకల్యాణం నిర్వహిస్తారు. వైశాఖమాసంలో వచ్చే సత్యదేవుడి వార్షిక కల్యాణానికి సీతారాములు పెళ్లి పెద్దలుగా వ్యవహరిస్తుండగా చైత్రమాసంలో వచ్చే సీతారాముల దివ్యకల్యాణానికి సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లు పెండ్లిపెద్దలుగా వ్యవహరిస్తారు. 18న ఆస్థానసేవ, 19న పండితసదస్యం, 20, 21 తేదీలలో నిత్యార్చనలు, ఆస్థానసేవ, 22న వనవిహారం, 23న చక్రస్నానం, 24న శ్రీపుష్పయోగంతో వేడుకలు ముగుస్తాయి. ఈ సందర్భంగా రామాలయానికి రంగులు వేసి విద్యుద్దీప అలంకరణలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం రూ.90.90 లక్షలు


హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

ఆత్రేయపురం, ఏప్రిల్ 15: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీలను దేవదాయ, ధర్మాదాయ శాఖ పర్యవేక్షణాధికారి డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం తెరిచి లెక్కించారు. 26 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.70,39,801, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.20,51,049.. మొత్తం రూ.90,90,850 ఆదాయం లభించింది. బంగారం 22 గ్రాములు, వెండి 700 గ్రాములు, పలు దేశాల కరెన్సీ లభించాయి. క్షేత్రపాలకుడు విశ్వేశ్వర హుండీ ఆదాయం రూ.2,33,164 లభించినట్టు ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. లెక్కింపులో కెనరా బ్యాంకు సిబ్బంది, పోలీసులు, అర్చకులు, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

తక్కువ బరువుతో పుట్టిన కవలలకు పునర్జన్మ

జీజీహెచ్ వైద్యుల కృషితో సంపూర్ణ ఆరోగ్యంతో డిశ్చార్జి


వివరాలు వెల్లడిస్తున్న వైద్య బృందం

జీజీహెచ్(కాకినాడ), ఏప్రిల్ 15: ఒకే కాన్పులో ముగ్గురు చొప్పున జన్మించి అతి తక్కువ బరువుతో ప్రాణాపాయంలో ఉన్న ఆరుగురు చంటి బిడ్డలకు కాకినాడ జీజీహెచ్ వైద్య బృందం ప్రత్యేక చికిత్సను అందజేసి పునర్జన్మను ప్రసాదించింది. పూర్తిగా కోలుకుని డిశ్చార్జ్ అయి ఇళ్లకు వెళుతున్న చిన్నారులకు సంబంధించిన వివరాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వెల్లడించారు. కోనసీమ జిల్లా అంబాజీపేటకు చెందిన సంధ్య, లక్ష్మీ వరప్రసాద్ దంపతులకు రెండో కాన్పులో ఈ ఏడాది ఫిబ్రవరి 1న నెలలు నిండకుండానే 8వ నెలలో ఒక ఆడ పిల్లకు, ఇద్దరు మగ పిల్లలకు మొత్తం ముగ్గురికి జన్మనిచ్చింది. ఆడ పిల్ల 1500 గ్రాముల బరువు, ఒక మగ శిశువు 1000 గ్రాముల బరువు, మరో మగ శిశువు 620 గ్రాముల బరువుతో జన్మించారు. శిశువు తల్లి గర్భంలో పూర్తిగా ఎదగకపోవడంతో అవయవాలు ఎదుగుదల కూడా జరగలేదు. దీంతో పిడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ డి.మాణిక్యాంబ ఆధ్వర్యంలో 620 గ్రాముల బరువు ఉన్న శిశువును నవ జాత శిశు సంరక్షణ కేంద్రం(ఎన్ఐసీయు)కు తరలించి చిన్నపిల్లల వైద్యులు 72 రోజులు నిరంతరప్రాయంగా శ్రమించి ప్రత్యేక వైద్య చికిత్సను అందజేశారు. దీంతో ప్రస్తుతం ఆ మగ శిశువు 1700 గ్రాముల బరువు పెరిగి పూర్తిగా కోలుకున్నాడు. ఆడ శిశువు 2.5 కిలోలు, 1000 గ్రాముల బరువుతో పుట్టిన మరో మగ శిశువు 2.2 కిలోల బరువుతో పూర్తిగా కోలుకున్నట్లు సూపరింటెండెంట్ తెలిపారు. అలాగే పెద్దాపురానికి చెందిన సత్యప్రియాంక, సతీష్ దంపతులు గతనెల 13న ఒకే కాన్పులో ముగ్గురు కవలలు జీజీహెచ్‌లో జన్మించారు. వారు కూడా బరువు 1000, 1500 గ్రాముల మధ్య తక్కువ బరువు కలిగి ఉండి ప్రాణాపాయంలో ఉండడంతో పిడియాట్రిక్స్ వైద్య నిపుణులు 32 రోజుల పాటు శ్రమించి ప్రత్యేక వైద్య చికిత్సను అందజేయడంతో శిశువులు ముగ్గురు పూర్తి ఆరోగ్యదాయకంగా ఉన్నట్లు డాక్టర్ లావణ్యకుమారి తెలిపారు. గొల్లప్రోలు మండలం కొడవలికి చెందిన జె.నాగమణి గత నెల 8న 1500 గ్రాములు, 910 గ్రాములు కవలలకు జన్మనిచ్చింది. కోరుకొండకు చెందిన దుర్గాభవాని 1500 గ్రాములు, 1000 గ్రాములు శిశువులకు జన్మనిచ్చారు. ఆ శిశువులను కూడా నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో ఉంచి 36 రోజులు పాటు ప్రత్యేక వైద్య బృందం కంటికి రెప్పలా కాపాడి పునర్జన్మను అందించారు. ఈ ప్రత్యేక వైద్యచికిత్సకు బయట ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.లక్షల్లో ఖర్చవుతుందని, రాష్ట్రంలోని 11 బోధనాస్పత్రుల్లో కంటే కాకినాడ జీజీహెచ్ పిడియాట్రిక్ విభాగ వైద్య సేవలు ప్రత్యేకతను సంతరించుకున్నాయన్నారు. ప్రాణాపాయంలో ఉన్న చంటి బిడ్డలకు పూర్తిగా కోలుకునేలా వైద్య చికిత్సను అందజేసిన ప్రొఫెసర్‌లు డాక్టర్ ఎస్.మాధవి, డాక్టర్ డీఎల్ విద్య, అసోసియేట్ ప్రొఫెసర్‌లు డాక్టర్ బుర్రి రాంబాబు, డాక్టర్ వి.విజయభాస్కర్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ మదన్‌మోహన్, డాక్టర్ గణపతి సూర్యనారాయణ, నియోనటాలజీ వైద్య నిపుణులు డాక్టర్ కీర్తి, డాక్టర్ ఆదిత్య, డాక్టర్ గౌతమిలను సూపరింటెండెంట్ అభినందించారు. జీజీహెచ్, చిన్న పిల్లల విభాగంలో నిష్ణాతులైన వైద్య నిపుణులు ఉన్నారని, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల ప్రజలు ఇక్కడ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ కోరారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో డాక్టర్ పుష్కరరావ్, డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ కోనాల అనిత, ఆర్ఎంవో డాక్టర్ యమున పాల్గొన్నారు.

భద్రాచలం రాముడికి కల్యాణ బొండాల సమర్పణ

మండపేట, ఏప్రిల్ 15: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణానికి చెందిన కాజులూరి వెంకటరామారెడ్డి గత 24 ఏళ్ల నుంచి భద్రాచలం రాములవారి శ్రీరామనవమి వేడుకల కోసం కల్యాణ బొండాలు తయారీ చేసి అందిస్తున్నారు. ఆయన 2000 సంవత్సరం నుంచి క్రమం తప్పకుండా స్వామివారికి బొండాలు అందిస్తున్నారు. ఉగాది రోజున బొండాలు తయారు చేయడం ప్రారంభించి పదిరోజులు వ్యవధిలోనే తయారీ పూర్తి చేశారు. మంగళవారం ఉదయం మండపేట నుంచి బొండాలను భద్రాచలానికి తరలిస్తున్నట్లు రామారెడ్డి తెలిపారు. అలాగే ఈనెల 22న కల్యాణం జరిగే ఒంటిమిట్ట రామాలయానికి కూడా బొండాలు పంపుతున్నానని రామారెడ్డి చెప్పారు. గొల్లలమామిడాడ లాంటి పలు ప్రసిద్ధి ఆలయాలకు కూడా బొండాలను పంపిస్తానని చెప్పారు.



నేడు రావులపాడు శివారులో సీఎం జగన్ బస


ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

రావులపాలెం, ఏప్రిల్ 15: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాడు శివారు మల్లయ్యదొడ్డి సెంటరు సమీపంలోని ఒక ప్రైవేటు లే-అవుట్‌లో సీఎం జగన్ మంగళవారం రాత్రి బస చేస్తారని వైసీపీ వర్గాలు తెలిపాయి. మంగళవారం రాత్రి 10.30కు జగన్ బస చేసే ప్రాంతానికి చేరుకుంటారు. 17వ తేదీ ఉదయం 10 గంటల నుంచి కోనసీమ జిల్లాలోని ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో సమావేశం నిర్వహిస్తారు. 18వ తేదీ ఉదయం 10 గంటల నుంచి రావులపాలెం కళా వెంకట్రావు సెంటరు మీదుగా జాతీయ రహదారిపై ఆలమూరు మండలం మడికి వరకు సుమారు మూడు గంటల పాటు బస్సు యాత్ర జరుగుతుంది.

ఫ్లోర్‌ఫ్రైడ్ ట్యాంకు సిలిండర్ నుంచి గ్యాస్‌లీక్

పరిశీలిస్తున్న పోలీసులు





జగ్గంపేట, ఏప్రిల్15: నీటిని శుద్ధి చేసేందుకు ఉపయోగించే ఫ్లోర్‌ఫ్రైడ్ ట్యాంకు సిలిండర్ నుంచి ప్రమాదకర గ్యాస్ లీకైంది. విషయం ఆలస్యంగా తెలిసినప్పటికీ జగ్గంపేట అగ్నిమాపక సిబ్బంది వెంటనే గ్యాస్ లీకేజీని అరికట్టడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం నరేంద్రపట్నం పంచాయతీ పరిధిలోని బావారం గ్రామంలో రక్షిత మంచినీటి ప్రాజెక్టులో ఈ ఘటన సోమవారం జరిగింది. జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో 36 గ్రామాలకు రక్షిత మంచినీటిని అందించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో సుమారు రూ.24 కోట్లతో బావారం రక్షిత మంచినీటి పథకం ప్రారంభించారు. ఏలేరు జలాలు శుద్ధి చేసి తాగునీటిని సరఫరా చేసేవారు. అయితే ఇటీవల కాలం ఈ ప్రాజెక్టు అధికార వైసీపీకి చెందిన ప్రయివేట్ కాంట్రాక్టర్ల చేతిలోకి వెళ్లింది. ఇక అప్పటి నుంచి దీని నిర్వాహణ పూర్తిగా గాడి తప్పింది. ప్లాంట్లో శుభ్రత లేకుండా పోయింది. అసలు ప్లాంట్లో ఏం జరుగుతుందో కూడా బయటకు తెలియని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో సోమవారం గ్యాస్ లీకేజీ ఘటనకు బయటకు పొక్కకుండా చూసేందుకు కాంట్రాక్టర్లు నానా ప్రయత్నాలు చేశారు. అయినప్పటికీ తహసీల్దార్, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందడంతో ఫైర్ ఆఫీసర్ లక్ష్మణరావు తన సిబ్బందితో వచ్చి గ్యాస్‌లీకేజీని అదుపుచేసి ప్రమాదం లేకుండా చర్యలు తీసుకున్నారు. తహసీల్దార్ ఇంతియాజ్‌బాషా సంఘటనా ప్రదేశాన్ని పరిశీలించారు. అయితే ఈఫ్లోర్‌ఫ్రైడ్ ట్యాంకును ఎప్పటికప్పుడు పరిశీలించడానికి ప్రత్యేకంగా సూపర్‌వైజర్ ఉండాలి కాని ఇక్కడ అలాంటి పరిస్థితి లేదు. దీంతో ఉద్యోగులు కూడా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఉద్యోగాలు చేస్తున్నారు. అసలే గ్రామానికి అతి దగ్గరగా ఉన్న ఈ ప్లాంట్ వల్ల తమ గ్రామానికి ఏం ముప్పు వాటిల్లుతుందోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని ప్లాంట్ నిర్వాహణపై తగిన జాగ్రత్తలు పాటించాలని ప్రజలు కోరుతున్నారు.

ఒకరికి అస్వస్థత

జగ్గంపేట మండలం బావారం రక్షిత మంచినీటి పథకం గ్యాస్ లీకేజీ ఘటనలో ఒకరు అస్వస్థతకు లోనయ్యారు. వాటర్‌ప్లాంట్ పైపులైన్ వద్ద క్లోరిన్ గ్యాస్ సిలెండర్ వాల్వు లీకవడంతో అగ్నిమాపక సిబ్బంది సిలిండర్‌ను వాటర్ కూలింగ్ చేసి వాల్వు కట్టేయడం జరిగిందని అధికారులు తెలిపారు. ఈఘటనలో గ్యాస్ పీల్చిన ఆపరేటర్ కంచి నాగేశ్వరరావు అస్వస్థతకు లోనవడంతో జగ్గంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స చేసిన అనంతరం ప్రస్తుతం కోలుకున్నట్లు తెలియజేశారు.

తనను దూరం పెడుతున్నాడని.. వ్యక్తి మర్మాంగాన్ని కోసేసిన యువతి

అల్లవరం, ఏప్రిల్ 15: తనను దూరం పెడుతున్నాడనే కోపంతో ఓ యువతి వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న వ్యక్తి మర్మాంగాన్ని సగం కోసేసింది. ఈ సంఘటన తీవ్ర సంచలనం రేపింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం సామంతకుర్రు పంచాయతీ ఎస్.రామేశ్వరం తీర గ్రామంలో ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పెళ్లికాని యువతికి, వివాహం అయిన చెక్క చినసత్తిబాబు అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉంది. ఈ మధ్య కాలంలో తనతో దూరంగా ఉండడమే కాక ఫోను చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో యువతి కక్ష పెంచుకుని ఆదివారం రాత్రి ఇంటికి రప్పించుకుని నిద్రపోతున్న సమయంలో సత్తిబాబు మర్మాంగాన్ని కోసేసింది. తీవ్ర రక్తస్రావం కాగా బాధితుడిని హుటాహుటిన అమలాపురం ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. యువతిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అల్లవరం ఎస్ఐ జి.హరీష్‌కుమార్ తెలిపారు.

మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

స్టేట్ టాస్క్‌ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ విజయ


సిబ్బందికి సూచనలిస్తున్న విజయ

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం, సారా తయారీ, రవాణా, విక్రయాలపై మరింత అప్రమత్తంగా ఉన్నామని స్టేట్ టాస్క్‌ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ స్పష్టం చేశారు. సోమవారం ఆమె స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ-సెబ్) రాజమహేంద్రవరం నార్త్ స్టేషన్‌ను పరిశీలించారు. సెబ్ జిల్లా అధికారి పి.సోమశేఖర్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించిన అనంతరం సిబ్బందికి అసిస్టెంట్ కమిషనర్ పలు సూచనలు చేశారు. ఎన్నికల సమయంలో పంపిణీ చేయడానికి మద్యం, సారా నిల్వ చేయడం, మాదకద్రవ్యాలు తదితర వాటిపై పటిష్ఠమైన నిఘాతో సమాచారం సేకరించి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సెబ్ కమిషనర్ ఎం.రవిప్రకాశ్ ఆదేశాలను కచ్చితంగా పాటించాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి నిబంధనలను అనుసరించాలని సూచించారు. గోదాములు తదితర ప్రాంతాల్లోని పెద్ద మొత్తంలో మద్యం నిల్వలపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. కాలిటీ, క్వాంటిటీ కేసులపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. అక్రమ మద్యం, సారా, మాదకద్రవ్యాలపై ఎలాంటి సమాచారం ఉన్నా సెబ్ పోలీస్‌స్టేషన్‌కు ప్రజలు సమాచారం అందించాలని సెబ్ జిల్లా అధికారి సోమశేఖర్ సూచించారు. అవసరమైతే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. అక్రమ మద్యం, సారా, మాదక ద్రవ్యాల నిల్వ, రవాణా, విక్రయాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో సెబ్ నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డా.ఎన్.నిక్సన్, ఎస్ఐ ఎంఎస్ఎన్ శాస్త్రి, డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ టి.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రామేశంపేట చెక్‌పోస్టు తనిఖీ

రంగంపేట, ఏప్రిల్ 15: రంగంపేట ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో రామేశంపేట వద్ద ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టును స్టేట్ టాస్క్ ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ తనిఖీ చేశారు. ఎన్నికలు కోడ్ మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు చెక్‌పోస్టుల పని తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. మద్యం, నగదు, ఇతర బహుమతులు రవాణా జరగకుండా చూడాలని చెప్పారు. తనిఖీల్లో ఎస్ఈబీ రంగంపేట సీఐ ఎస్.రాంబాబు, పెద్దాపురం సీఐ ఏయూబీ సుబ్రహ్మణ్యం, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ టి.గోపాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



ఏలేశ్వరం, ఏప్రిల్ 15: కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలంలోని యర్రవరం గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మహిళ సోమవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలేశ్వరం దిబ్బలపాలెంకు చెందిన పొన్నగంటి రామకృష్ణ కుమార్తె లోవదుర్గకు భీమవరానికి చెందిన ఎలుబోలు సురేష్ తో సుమారు 8 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఏలేశ్వరం నుంచి వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం ఆటోలో వెళ్తుండగా యర్రవరం చెక్‌పోస్టు వద్దకు వెళ్లే సరికి ఆటోలో వెళ్తున్న లోవదుర్గకు వాంతులు అవ్వడంతో తమ తల బయటపెట్టి వాంతులు చేసుకొంటుండగా వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం లోవదుర్గ (29) తలను ఢీకొనడంతో తలకు బలంగా తగలడంతో రక్తం కారుతుండగా ఆటోలో ఉన్న వాళ్లు ఆటో డ్రైవర్ సాయంతో ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించారు. ఏలేశ్వరం ఎస్ఐ సతీష్ కేసు నమోదు చేశారు.

హోటళ్లు, బిర్యానీ పాయింట్లపై అధికారుల దాడులు

పిఠాపురం, ఏప్రిల్ 15: పిఠాపురం పట్టణంలోని హోటళ్లు, బిర్యానీ పాయింట్లలో విజిలెన్స్ రెవెన్యూ, సివిల్ సప్లైస్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న డొమెస్టిక్(గృహ అవసరాల) సిలిండర్లును స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని స్టువర్టుపేటలో గల హరివిల్లు ఫుడ్స్‌ను తనిఖీ చేయగా ఏడు డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. హరివిల్లు ఫుడ్స్ యజమాని రావుల శేషుకుమార్‌పై నిత్యావసర వస్తువుల చట్టం 6ఏ, ఎల్‌పీజీ చట్టం 2000 కింద కేసు నమోదు చేసి సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. అదే ప్రాంతంలోని బిరియాని పాయింట్‌లో తనిఖీలు చేసి అయిదు డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని యజమాని పిల్లా శ్రీనివాస్‌పై 6ఏ కింద కేసు నమోదు చేశారు. గృహ సిలిండర్ల వినియోగంలో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఎస్పీ హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారి జగన్నాథరెడ్డి, లక్ష్మీనారాయణ, సీఎస్‌డీటీ ఇస్మాయిల్, జీవానందం, లోవరాజు పాల్గొన్నారు.

మళ్లీ అమ్మాయే పుట్టిందని..

మగబిడ్డపై మమకారంతో నాలుగో సారి గర్భవతి అయిన మహిళ

భర్తకు సైతం తెలియని వైనం

అబ్బాయి పుడితే చెబుతామని..అమ్మాయి పుడితే వదిలించుకుందామనుకున్న మహిళ

అమ్మాయే పుట్టడంతో తుప్పల్లోకి..

గుర్తించిన స్థానికులు. బయటపడిన నిజం


తుప్పల్లో పడేసిన పాప

కడియం, ఏప్రిల్ 15: మగ సంతానంపై మమకారం పెంచుకున్న తల్లి మానవత్వం మరిచి అప్పుడే పుట్టిన పసికందును 20 అడుగుల ఎత్తులో నుంచి తుప్పల్లోకి విసిరేసింది. తర్వాత తన తప్పు తెలుసుకుని కన్నీరుపెట్టింది. ఈ సంఘటన తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం వేమగిరిలో జరిగింది. స్థానికులు, బంధువులు, వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వేమగిరి గణపతినగర్‌కు చెందిన తాపీ పనిచేసే వ్యక్తికి ముగ్గురు ఆడపిల్లలు.. వారు ప్రస్తుతం స్కూలుకు వెళుతున్నారు. అయితే సదరు వ్యక్తి భార్యకు మగసంతానంపై మమకారంతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్నట్టు నమ్మించి గర్భం దాల్చింది. అయితే ఈ విషయాన్ని గోప్యంగా ఉంచింది. అబ్బాయి పుడితే అందరికి చెబుదాం.. అమ్మాయి పుడితే మాయం చేద్దాం అనే ఉద్దేశంతో ఉంది. బంధుమిత్రులకు, పరిసర ప్రజలకు విషయం తెలియకుండా దాచింది. భర్తకు కూడా అనుమానం రాకుండా చేసింది. పొట్ట పెరుగుతుందని భర్త అనడంతో ఈ మధ్య తినడంతో పెరుగుతుందని నమ్మించింది. స్థానిక వైద్య సిబ్బందికి, అంగన్‌వాడీలకు తాను గర్భిణీ అనే విషయం ఇవ్వక పోగా అందుకు సంబంధించి వైద్యసేవలు పొందలేదు. ఆదివారం పురుటినొప్పులు వచ్చాయి. అది గమనించి తన భర్తను, పిల్లలను చర్చికి పంపింది. తనకు తానే పురుడు పోసుకుంది. అందుబాటులో ఉన్న కత్తిపీటతో పేగును కత్తిరించింది. అమ్మాయి పుట్టిందని గమనించిన వెంటనే ముందుగా అనుకున్న పథకం ప్రకారం నైటీలో పసికందును చుట్టి 20 అడుగుల ఎత్తు నుంచి తుప్పల్లోకి విసిరేసింది. అక్కడ చెత్తాచెదారం, పందులు ఉన్నాయి. అక్కడి నుంచి వెళ్లి స్నానం చేసి ఎవ్వరికీ తెలియనివ్వకుండా దాచింది. అయితే తుప్పలు నుంచి ఏడుపులు వినిపించడంతో చుట్టుప్రక్కల వారు వెళ్లి చూడగా ముద్దులొలికే ఆడశిశువు కనిపించింది. కాలికి చిన్న రాపిడి గాయం తప్ప క్షేమంగా ఉంది. పసికందు ఎవరనేది అందరిలో చర్చ మొదలైంది. బయట నుంచి అక్కడ ఎవరూ పసికందు పాడేసే అవకాశం లేనందున అక్కడి వారి పిల్లే అయి ఉంటుందని ఆరా తీశారు. ఇంతలో అందరితో పాటు భర్త వచ్చి చూస్తే పసికందుకు చుట్టి ఉన్న నైటీ కనిపించింది. ఆ నైటీ తన భార్యదని గుర్తించాడు. ఆ నైటీ ఆధారంగా ఇంటికెళ్లి భార్యను నిలదీశాడు. దీంతో జరిగిన విషయం చెప్పింది. ఆపై ఆ తల్లి కన్నీరుమున్నీరుగా విలపించింది. మగ సంతానంపై మమకారంతో ఇలా చేశానని గగ్గోలు పెట్టింది. తల్లీబిడ్డను కడియం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇద్దరూ క్షేమంగా ఉన్నారని బంధువులు, వైద్యులు తెలిపారు.



అంతర్వేది ఆలయ రాజగోపురంపై కలశాల స్థాపన

అంతర్వేది, ఏప్రిల్ 15: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో ఉత్తర రాజగోపుర కలశాల పూజా కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజల అనంతరం కలశల పునఃప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ఆలయ అధికారులు కలశలతో ఆలయ ప్రదక్షిణ అనంతరం క్రేన్ సాయంతో ఉత్తర రాజగోపురంపై కలశలను అర్చకులు ప్రతిష్ఠించారు. అనంతరం 11 గంటలకు పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజాకలిదిండి కుమార రామగోపాలరాజాబహదూర్, ఆలయ ఏసీ వి.సత్యనారాయణ, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

లోవలో పంచలోహ విగ్రహాల పునఃప్రతిష్ఠ



తుని రూరల్, ఏప్రిల్15: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆలయంలో తలుపులమ్మ అమ్మవారి పంచలోహ విగ్రహాల పునఃప్రతిష్ఠ సోమవారం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బ్రహ్మశ్రీ ఇమని నాగ వెంకట కృష్ణ, ఐజమూరి రామంతో పాటుగా ఇతర పండితులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి పంచలోహ విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి లోవ దేవస్థానం పరిసర గ్రామాల భక్తులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కార్యనిర్వహణాధికారి, ఉప కమిషనర్ పెన్మచ్ఛ విశ్వనాథ రాజు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సరుకుతో పాటు వ్యాన్ దగ్ధం



మండపేట, ఏప్రిల్ 15: మండపేట మండలం ఇప్పనపాడు వద్ద రోడ్డుపై విద్యుత్‌లైన్లను తాకడంతో తాపేశ్వరం నుంచి పరుపులు తయారీ కోసం వినియోగించే పోమ్ ముడి సరుకును తీసుకువెళ్తున్న వ్యాన్ సరుకుతో సహా కాలిబూడిదైంది. ద్వారపూడి వైపు వెళ్తున్న లోడ్ వ్యాను ఇప్పనపాడు వద్ద ఉన్న రైస్‌మిల్లు వద్దకు వచ్చేసరికి ప్రమాదం జరిగింది. విషయాన్ని గమనించిన డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించి వ్యాన్‌ను రోడ్డు మీద నుంచి ఊరు బయట ఖాళీ ప్రదేశానికి తరలించే ప్రయత్నం చేశాడు. కానీ చివరకు మంటలు వ్యాపించటంతో ఇప్పనపాడు శివారు రిలయన్ కాలనీ వద్ద వదిలేసి డ్రైవర్ బయట పడ్డారు. అనపర్తి, మండపేట అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ముడిసరుకు, వ్యాన్ విలువ సుమారు రూ.23 లక్షలు మేర ఉంటుందని అధికారులు శ్రీనివాసరెడ్డి, హనుమంతరావు తెలిపారు.

కాకినాడ

మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ

మూలపేట (కొత్తపల్లి), ఏప్రిల్ 15: మూలపేటలో మహిళా నైపుణ్యాభివృద్ధి కేంద్రం (డబ్ల్యుఎస్‌డీసీ) ద్వారా కుట్టు శిక్షణ పూర్తిచేస్తున్న 25 మంది మహిళలకు సోమవారం కెనారా బ్యాంక్ మేనేజర్ ధర్మారావు, అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధి సుధాకర్ సర్టిఫికెట్లను అందజేశారు. తమ ఆర్థికాభివృద్ధికి ఎన్నో సేవా కార్యక్రమాలను చేస్తున్న అరబిందో ఫార్మాకు ఈ సందర్భంగా మహిళలు కృతజ్ఞతలు తెలియజేశారు.

కూటమి విజయం ఖాయం : తంగెళ్ల

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 15: వైసీపీ కార్యాలయాల వద్ద జనాలు లేక, డబ్బులిచ్చి కార్యకర్తలు, వలంటీర్లను తిప్పుకుంటున్నారని, రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయం ఖాయమని కాకినాడ పార్లమెంట్ జనసేన కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ అన్నారు. సోమవారం సర్పవరంలో పార్టీ నాయకుడు పుల్ల శ్రీరాములు ఆధ్వర్యంలో టీడీపీ-బీజేపీ నాయకులు,కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తంగెళ్ల మాట్లాడుతూ వైసీపీ గెలవడం సాధ్యం కాదని కార్యకర్తలకు తెలిసిపోయిందని, దాంతో వలంటీర్లు రాజీనామాలు చేయండి డబ్బులిస్తామంటూ బలవంతంగా తిప్పుకుంటున్నారని విమర్శించారు. వైసీపీపై ఉన్న ప్రజా వ్యతిరేకతను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ, ఎంపీగా తనకు ఘన విజయం సాధించేలా కృషి చేయాలని కోరారు. పలువురు గ్రామస్థులకు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఇటీవల పార్టీలో చేరిన బ్రాహ్మణ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ దివవహి పేర్రాజు (పేరుబాబు), మాజీ సర్పంచ్ బొండాడ విజయ లక్ష్మణ్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పుల్ల శేషయ్య, టీడీపీ నాయకులు కట్టా గోపాల్, బీజేపీ సీనియర్ నాయకులు మామిడాల శ్రీనివాసరావు, జనసేన నాయకులు ముద్దన సూర్యప్రకాశరావు, పుల్ల వీరబాబు తదితరులు ఉన్నారు.

కొత్త డ్రామాకు తెరతీసిన జగన్ : జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, ఏప్రిల్ 15: సీఎం జగన్ కొత్త డ్రామాకు తెరతీశారని జగ్గంపేట ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ విమర్శించారు. సోమవారం గోకవరం మండలం తంటికొండ గ్రామంలో వేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రతి ఎన్నికల్లో నామినేషన్ ముందు తంటికొండ వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం అనవాయితీగా వస్తుందని, గోకవరం మండలంలో చైతన్య రథంపై ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తున్నారన్నారు. సీఎం జగన్‌పై దాడి నిజంగా జరిగితే తీవ్రంగా ఖండిస్తున్నానని కానీ ఈలోగా తగిన గాయం చూస్తుంటే వై ఆకారంలో ఉందన్నారు. సోషల్ మీడియాలో వీడియో చూస్తుంటే దండ వేసేటప్పుడు తగిలిన గాయంగా కనిపిస్తుందన్నారు. గత 2019 ఎన్నికల్లో కోడికత్తి డ్రామాతో, నారా వారి రక్త చరిత్ర అని మాయమాటలతో గద్దెనెక్కిన జగన్ మళ్లీ ఇప్పుడు కోడికత్తి సెకండ్‌పార్ట్ విడుదల చేసినట్టు ఉందన్నారు. ఈ గాయాలతో ప్రజలను మధ్యపెట్టాలని ప్రతిపక్షాలపై నెట్టాలని ఈ విధంగా చేయడం విడ్డూరంగా ఉందని, జగన్ ఎన్ని డ్రామాలు ఆడినా ప్రజలు తిరస్కరిస్తారని తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులున్నారు.

ఎన్నికల్లో గెలిపించి ఆశీర్వదించండి : సత్యప్రభ

ప్రత్తిపాడు, ఏప్రిల్ 15: దివంగత టీడీపీ నేత వరుపుల రాజా ఆశయ సాధన నియోజకవర్గ అభివృద్ధికి జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించి ఆశీర్వదించాలని ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా కోరారు. ఒమ్మంగి రామిశెట్టి గోవిందరాజులు కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో సత్యప్రభ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ నామినేషన్ ఈ నెల 23న దాఖలు చేస్తానని, 23న పెదశంకర్లపూడి పార్టీ కార్యాలయం నుంచి ఉదయం 9.30గంటలకు నామినేషన్ దాఖలు ప్రక్రియ ప్రారంభమవుతుందని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు అమరాది వెంకట్రావు, సూది బూరయ్య, బద్ది రామారావు, తమరాల సత్యనారాయణ, కొమ్ముల కన్నబాబు, ఎంపీపీలు గొల్లపల్లి నరసింహమూర్తి, గంటుమళ్ళ రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ ఇతంశెట్టి భాస్కరబాబు, మాజీ జడ్పీటీసీ బచ్చల గంగ, మాజీ సర్పంచ్ పైలా సాంబశివరావు, మాజీ సొసైటీ అధ్యక్షుడు చిక్కాల లక్ష్మణరావు, వెన్నా ఈశ్వరుడు, బద్ది రమణ పాల్గొన్నారు.

'బస్‌షెల్టర్ ఏర్పాటు అభినందనీయం'

కాకినాడ సిటీ, ఏప్రిల్ 15: ప్రయాణికులకు నీడనిచ్చేందుకు ఆంధ్రా బ్యాంక్ ఉద్యోగులందరూ కలిసి ప్రధాన రహదారిపై బస్‌షెల్టర్ సదుపాయం కల్పించడం అభినందనీయమని యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ సాయి మనోహర్ అన్నారు. కాకినాడ ప్రతాప్‌నగర్ వద్ద ఆంధ్రా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ నూతనంగా ఏర్పాటు చేసిన బస్ షెల్టర్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి యూనియన్ నాయకుడు జె.సత్యనారాయణ ఆధ్వర్యం వహించారు. మనోహర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజనల్ హెడ్ రంగారావు, ఆంధ్రా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎస్.సత్యనారాయణ, వీఎస్ఎన్ మూర్తి, తాతారావు, సుధాకర్, ఆదినారాయణమూర్తి, జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'ఓఎన్‌జీసీ నిధులను దారి మళ్లించిన ఎమ్మెల్యే'

తాళ్లరేవు, ఏప్రిల్ 15: తమ గ్రామంలో కమ్యూనిటీహాల్ నిర్మాణానికి కేటాయించిన ఓఎన్‌జీసీ నిధులు రూ.10లక్షలను ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ దారి మళ్లించేశారని పోలేకుర్రు పంచాయతీ చినబాపనపల్లి గ్రామపెద్ద మాతా జీవానందం, వార్డుసభ్యులు గుత్తాల రాంబాబు ఆరోపించారు. సోమవారం వారు మాట్లాడుతూ తమ గ్రామానికి టీడీపీ హయాంలోనే సిమెంటురోడ్లు నిర్మాణం వంటి అభివృద్ధి జరిగిందని, వైసీపీ చేసిందేలేదన్నారు. గ్రామంలోకి ఎమ్మెల్యేను రానివ్వమని అడ్డుకుంటామన్నారు. గ్రామస్తులు పెండెం వీరబాబు, బానుప్రసాద్, కర్రి నరేష్, వెంకటరమణ పాల్గొన్నారు.

'తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి'

పెద్దాపురం, ఏప్రిల్ 15: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీపీ పెంకే సత్యవతి, జడ్పీటీసీ గవరసాన సూరిబాబు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఎం.ఉషారాణీ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో వారు పాల్గొని సోమవారం మాట్లాడారు. ముఖ్యంగా మెట్టగ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ నక్కా సత్యనారాయణమూర్తి కార్యాలయ పరిపాలనాధికారి సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశాలు

కిర్లంపూడి, ఏప్రిల్ 15: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ తోట రవి ఆధ్వర్యాన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జగపతినగరం సర్పంచ్ గుడాల శ్రీలత మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో జగపతినగరం, చిల్లంగి, కిర్లంపూడి గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించడంలేదన్నారు. ఏపీవో నాగమణి మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పనులు కల్పిస్తామన్నారు. వివిధ సర్పంచ్‌లు గ్రామాల్లో సమస్యలను తెలిపారు. వైస్‌ఎంపీపీ బొడ్డేటి గణపతి, ఎంపీడీవో బడే రాజేశ్వరరావు, సర్పంచ్‌లు పట్టు చంటిబాబు, రాయుడు బాబురావు, ఎంపీటీసీ గోవిందు ఉన్నారు.

కొత్తపల్లి: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం సాదాసీదాగా జరిగింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన అనంతరం ఎటువంటి తీర్మానాలు, ఆమోదించకుండా హాజరైన 10 మంది ఎంపీటీసీతో మమ అనిపించారు. ఎంపీపీ కారే సుధా శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేర్ కేంపెయిన్ ప్రోగ్రామ్‌పై అవగాహన

జీజీహెచ్ (కాకినాడ), ఏప్రిల్ 15: కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం సమావేశపు హాల్లో నేషనల్ హెల్త్ మిషన్, నూర్ హెల్త్‌ల సంయుక్తంగా సోమవారం కేర్ కేంపెయిన్ ప్రోగ్రామ్‌పై డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ అవగాహన కల్పించారు. గర్భిణులు, గర్భం దాల్చిన తర్వాత ఎస్‌సీడీ పిల్లల, కిశోర బాలబాలికలకు అర్థమయ్యేలా హెల్త్ ఎడ్యుకేషన్ చేయాలని ఆయన ఆదేశించారు. జిల్లాలో ఉన్న 410 మంది ఎంఎల్‌హెచ్‌పీఎస్‌కి బ్యాచ్‌లవారీగా సీసీపీ హెల్త్ ఎడ్యుకేషన్ ద్వారా రోగులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. డీఐవో డాక్టర్ కె.రత్నకుమార్, సీసీపీ ప్రోగ్రామ్ కన్సల్టెంట్ డాక్టర్ కార్తీక్, టీవోటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తులసి పాల్గొన్నారు.


చంద్రబాబుకు పావని కృతజ్ఞతలు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 15: తనపై ఎంతో నమ్మకం ఉంచి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించిన పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశాలకనుగుణంగా పార్టీ విజయానికి పాటుపడతానని కాకినాడ నగర మాజీ మేయర్ సుంకర పావని కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తున్నారని కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు తెలుగు నాటక రంగ దినోత్సవం

పోర్టుసిటీ, ఏప్రిల్ 15: తెలుగు నాటక రంగ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని యంగ్‌మెన్స్ హ్యాపీక్లబ్ అధ్యక్షుడు దంటు భాస్కరరావు తెలిపారు. కాకినాడ మున్సిపల్ కార్యాలయం వెనుక వెంకటరత్నపురంలోని దంటు కళాక్షేత్రంలో సాయంత్రం 5 గంటల నుంచి జరగనున్నాయన్నారు. దంటు సూర్యారావు స్మారక జీవితకాల నట పురస్కారాన్ని డాక్టర్ మీగడ రామలింగస్వామికి అందిస్తామన్నారు. కపిరాజు ప్రయోగాత్మక నాటిక ప్రదర్శన ఉంటుందని వివరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ పి.చిరంజీవినికుమారి హాజరవుతారని తెలిపారు.

భీమేశ్వరాలయానికి బంగారు ఆభరణం అందజేత


ఆభరణం అందజేస్తున్న దాత కుటుంబం

సామర్లకోట, ఏప్రిల్ 15: సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయానికి గాజువాకకు చెందిన ఆత్మకూరి వెంకట్రాజు అతడి కుమారుడు ఆత్మకూరి చక్రవర్తి కుటుంబాలచే సుమారు రూ.2.14 లక్షల విలువ చేసే తెలుగు అక్షమాల అనే బంగారు ఆభరణాన్ని సోమవారం ఆలయంలో సంప్రోక్షణ పూజల అనంతరం ఆలయానికి అప్పగించారు. ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు ఆభరణానికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. దాతలకు వేద పండితులచే వేదస్వస్తి పలికి ప్రసాదాలు అందజేశారు.

సైకో పాలనను సాగనంపేందుకు సిద్ధం

పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప

పలుచోట్ల కూటమి అభ్యర్థుల ప్రచారం


సామర్లకోట: రాజప్పకు తిలకం దిద్దుతున్న మహిళ, కాకినాడలో ఎన్నికల ప్రచారంలో కొండబాబు

పెద్దాపురం, ఏప్రిల్ 15: సైకో సీఎం జగన్ పాలనను సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మండల పరిధిలోని కట్టమూరు, సీబీ దేవం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమం అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ టీడీపీ అన్నారు. ఈ ఎన్నికల కోసం రాష్ట్రం యావత్తు ఎదురుచూస్తున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధి కావాలంటే టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయానికి ప్రజలు సహకరించాలన్నారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన పలువురు రాజప్ప సమక్షంలో టీడీపీలో చేరగా వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమాల్లో టీడీపీ నేతలు రాజాసూరిబాబురాజు, ఎలిశెట్టి నాని, గుత్తుల సూర్యావతీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట: రాష్ట్రంలో వైసీపీ అరాచకపాలనకు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు కూటమి అభ్యర్థులను గెలిపించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్, టీడీపీ మండలాధ్యక్షుడు తోటకూర శ్రీనివాస్, కుర్రా నారాయణ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజప్ప హాజరై సూపర్‌సిక్స్ కరపత్రాలను మహిళలకు అందించి టీడీపీని ఆదరించాలని కోరారు. ప్రచారంలో కూటమి నాయకులు తుమ్మల బాబు, విత్తనాల వెంకటరమణ, పాలకుర్తి శ్రీనుబాబు, సర్వేశ్వరరావు, చీకట్ల వెంకటేష్, పెంకే వెంకటేష్, ముసిరెడ్డి శ్రీరాములు, రాంబాబు, ముమ్మిడి సూరిబాబు, కొప్పిరెడ్డి రాజా తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ సిటీ: తెలుగు రాష్ట్రాల్లో సంక్షేమానికి, అభివృద్ధికి పునాది వేసింది టీడీపీ అని, ఆనాడు ఎన్టీఆర్, ఆ తర్వాత చంద్రబాబు తెలుగు రాష్ట్రాలను అభివృద్ధి పథంలో నడిపించి సంక్షేమ పాలన అందించారని కాకినాడ సిటీ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు అన్నారు. 16వ డివిజన్‌లో ఆయన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కలిసి ఇంటింట ఎన్నికల ప్రచారం సాగించారు. వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని, సంక్షేమాన్ని విస్మరించి దోపిడీయే ధ్యేయంగా పాలన కొనసాగించారన్నారు. ఎన్నికల్లో సైకిల్, గ్లాస్ గుర్తులపై ఓట్లు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించి కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో మల్లాడి చిన్న, కోనాడ ప్రకాష్, మద్దు విజయ్‌కుమార్, సీకోటి సింగ్, వరిపిల్లి ప్రసాద్, దోమ రాజు, మల్లాడి రాజు, చింతా సతీష్, రేకాడి లోవరాజు, మండపాక దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఏలేశ్వరం: మండలంలోని తిరుమాలి గ్రామంలో జయహో బీసీ ఎన్నికల ప్రచారాన్ని ప్రత్తిపాడు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి కృషిచేసింది చంద్రబాబేనని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీసీలకు సబ్సిడీలపై లోన్లు, ఉన్నత పదోన్నతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు, మండలాధ్యక్షుడు సూతి బూరయ్య ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, మాజీ జడ్పీటీసీ జ్యోతుల పెదబాబు, చందువోలు సాయిరాజా, సూతి వీర ప్రభాకర్, బొదిరెడ్డి గోపి, అలమండ చలమయ్య, ధనేకుల భద్రరావు, జిగటాపు సూరిబాబు, బెల్లాని శ్రీను ఉన్నారు.

రౌతులపూడి: ఎమ్మెల్యేగా ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ విజయం కోసం ఆమె తనయుడు సాయితర్షిత్ బంగార య్యపేటలో టీడీపీ నేత గుండ్రాజు దివాణం ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ ఇంటశెట్టి సూర్యభాస్కరరావు, మాదాసు శ్రీను, ఇంటశెట్టి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కోటనందూరు: ఎన్నికల్లో వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పాలని తుని కూటమి అభ్యరిథ యనమల దివ్య అన్నారు. సోమవారం రాత్రి బొద్దవరం గ్రామంలో బాబుష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు అధ్యక్షతన నిర్వహించగా దివ్య మాట్లాడుతూ వైసీపీ ఎన్ని కుతంత్రాలు పన్నినా రాష్ట్రంలో కూటమి విజయ దుందుభి మోగించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో యనమల రాజేష్, మోతుకూరి వెంకటేష్, పెంటకోట భాస్కరసత్యనారాయణ, డి.చిరంజీవిరాజు అంకంరెడ్డి రమేష్, యల్లపు వెంకటరమణ, వేగి గోపి, షేక్‌నవాబ్ జానీ, గెద్దం కొండయ్యనాయుడు, చింతకాయల రవికుమార్, యర్ర చినసత్యనారాయణ, అంకంరెడ్డి బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: మండలంలో కాండ్రేగుల, భావారం, నరేంద్రపట్నం గ్రామాల్లో ప్రత్యేక వాహనంలో బీసీ నేతలు జయహో బీసీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీసీ సెల్ అధ్యక్షులు తాళ్ళూరు సర్పంచ్ శిలామంతుల వీరబాబు ఆధ్వర్యంలో ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూను గెలపించాలని కోరారు. కార్యక్రమంలో శిలామంతుల వీరబాబు, తంగళ్ళ అప్పారావు, బొండా శీనుబాబు, కూసుమంచి సత్యనారాయణ, బూర్లు అప్పలరాజు, బోరా సత్తిబాబు, జై శ్రీనివాస్, నంగర శ్రీను పాల్గొన్నారు. ఇర్రిపాక, మామిడాడలో జ్యోతుల అనీష్ నెహ్రూ ఆధ్వర్యంలో యువగళం టీమ్ గడపగడపకు వెళ్ళి ప్రచారం చేశారు. యువగళం టీం జగ్గంపేట యువత అధ్యక్షులు వెలిశెట్టి శ్రీను, గోకవరం మండల తెలుగు యువతఅధ్యక్షులు గుండా శివప్రసాద్ పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలంలోని జగపతినగరంలో జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కుమార్తె తోట సునీత ఇంటింటా టీడీపీ ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓటేసి నెహ్రూను అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. తోట సర్వారాయుడు, కాళ్ల వెంకటేష్, ఆళ్ల బాబులు, దొడ్డిపట్ల బుజ్జి, జ్యోతుల సత్యమూర్తి, శ్రీబాబు ఉన్నారు.

సర్పవరం జంక్షన్: కాకినాడ రూరల్ కూటమి అభ్యర్థి పంతం నానాజీ ఒకటో డివిజన్‌లో కూటమి నాయకులతో కలసి ఇంటింట ఎన్నికల ప్రచారం నిర్వహించి, గాజు గ్లాసు గుర్తుపై ఓట్లేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌లను గెలిపించాలని కోరారు. టీడీపీ కో కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ), మాజీ కార్పొరేటర్ పేరాబత్తుల లోవబాబు, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకులు రంబాల వెంకటేశ్వరరావు, పాలికరమణ,మాచవరపు సత్యనారాయణ ఉన్నారు.

గొల్లప్రోలు: టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు గొల్లప్రోలులో 10వ వార్డు గాంధీనగర్‌లో పర్యటించి పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్, కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌లకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ప్రచారంలో కూటమి పార్టీల నాయకులు గిరీష్‌వర్మ, కదారి తమ్మయ్యనాయుడు, శీరం మాణిక్యం, గుండ్ర సుబ్బారావు, పర్ల రాజా, చిట్టా మధు, బస్సా చిట్టిబాబు, మామిడాల సూరిబాబు పాల్గొన్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ప్రచారంలో టీడీపీ, జనసేన నాయకులు ఉలవకాయల దేవేంద్రుడు, జ్యోతుల శ్రీనివాస్, ఓదూరి నాగేశ్వరరావు, ఓరుగంటి రఘు, నానాజీ, మల్లిపూడి వీరబాబు, చేదులూరి త్రిమూర్తులు పాల్గొన్నారు.

కరప: కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్ర భవిష్యత్ బాగుంటుందని, ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓటేయాలని టీడీపీ కాకినాడరూరల్ కో-ఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు కోరారు. మండలంలోని యండమూరులో కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, పంతం నానాజీలకు మద్దతుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. జనసేన, టీడీపీ నాయకులు పంతం సందీప్, బండారు మురళి, మద్దూరి స్వామి, మేడిశెట్టి పట్టాభి, పిల్లి శ్రీను ఉన్నారు.


ఏలేశ్వరం: తిరుమాలిలో ప్రచారంలో సత్యప్రభ,కోటనందూరు: యనమల దివ్యకు మహిళ హారతి

టీడీపీలో భారీగా చేరికలు


తాళ్లరేవు: బుచ్చిబాబు సమక్షంలో టీడీపీలో చేరికలు

తాళ్లరేవు, ఏప్రిల్ 15: వైసీపీ పాలనపై విసుగుచెందిన గాడిమొగ పంచాయతీ పెదవలసల గ్రామానికి చెందిన మత్స్యకారులు పోతా బత్తుల కృష్ణ ఆధ్వర్యంలో మురమళ్ల టీడీపీ కార్యాలయంలో ముమ్మిడివరం కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సమక్షంలో సోమవారం టీడీపీలో చేరారు. ఆయన పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తాళ్లరేవు, గాంధీనగర్‌ల్లో నూతనంగా నిర్మించిన శ్రీ కృష్ణా దేవాలయం, శ్రీసీతారాముల దేవాలయాల్లో బుచ్చిబాబు సోమవారం పూజలు చేశారు. కరకుదురు వేదపండితులు వి.గోపాలాచార్యస్వామి ఆధ్వర్యంలో అర్చకులు పూజలు చేసి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు.

ప్రత్తిపాడు/రౌతులపూడి: నియోజకవర్గంలో రౌతులపూడి మండలానికి చెందిన 150కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. రౌతులపూడి మాజీ ఎంపీపీ ఇతంశెట్టి సూర్యభాస్కరబాబు ఆధ్వర్యంలో టీడీపీలో చేరగా వారిని కూటమి అభ్యర్థి సత్యప్రభ ఆహ్వానించారు. చేరినవారిలో రౌతులపూడి ఆసుపత్రి చైర్మన్ కైచర్ల సత్యనారాయణ మూర్తి, సొసైటీ మాజీ అధ్యక్షులు కైచర్ల బాబులు, మాజీ డైరెక్టర్ యర్రా వరహాలు దొర, సుర్ల జబీర్, పైలా బుల్లిబాబు, కొల్లా శ్రీను, ఇతంశెట్టి సన్యాసిదేవుడు, పంపల దేవుడు, కొరుప్రోలు రమణ, గొర్ల నానీలు ఉన్నారు. రౌతులపూడి మండలం బంగారయ్యపేటకి చెందిన 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. ఉండ్రాజు దివానం ఆధ్వర్యంలో గోశాల సూరిబాబు, రాంబాబు, సత్తిబాబు, కె.వెంకటరమణ, కె.శివ, తాతాజీ, ఉండ్రాజు జగ్గారావు, ఎ.అంజిబాబు, నడిగట్ల సత్తిబాబు, పి.సత్తిబాబు,అప్పన్నను పార్టీలోకి సత్యప్రభ ఆహ్వానించారు.

సామర్లకోట: పట్టణ పరిధి వీర్రాఘవపురానికి ఆకుల శివరామకృష్ణ తదితర 30మంది అనుచరులు సోమవారం టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్ పట్టణ టీడీపీ కమిటీ నాయకుల ఆధ్వర్యంలో టీడీపీలో చేరగా ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

పిఠాపురం/పిఠాపురం రూరల్: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పిఠాపురం మండలం బి.కొత్తూరు గ్రామంలో దొడ్డి నాగు ఆధ్వర్యంలో వైసీపీ నుంచి సంగిశెట్టి సత్తిబాబు, నానాజీ మిత్రబృందం 100మంది టీడీపీలో చేరగా వారికి వర్మ టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పట్టణంలోని 18,22 వ వార్డుల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు.


బి.కొత్తూరులో టీడీపీలో చేరినవారితో వర్మ

నామినేషన్ల దాఖలులో నిబంధనలు పాటించాలి

జేసీ రాంసుందర్‌రెడ్డి


పిఠాపురం సమావేశంలో జేసీ

పిఠాపురం, ఏప్రిల్ 15: నామినేషన్ల దాఖలు సమయంలో ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా జాయింట్ కలెక్టరు, పిఠాపురం అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి రాంసుందర్‌రెడ్డి సూచించారు. నామినేషన్ల పక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం పిఠాపురంలోని ఆర్వో కార్యాలయంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 18నుంచి 25 వరకూ సెలవులు మినహా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకూ నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని జేసీ తెలిపారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి ముందుగా వచ్చిన వారి నామినేషన్ ముందుగా స్వీకరిస్తామని, సమయం కోసం ముందస్తు అనుమతులు ఉండవని స్పష్టం చేశారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో అయిదుగురిని మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. నామినేషన్ల పరిశీలన 26న, ఉపసంహరణకు 29న మధ్యాహ్నం 3గంటల వరకూ అవకాశం ఉందని చెప్పారు. కాకినాడ డీఎస్పీ హనుమంతరావు మాట్లాడుతూ నామినేషన్ల దాఖలు ర్యాలీ నిర్వహిస్తే అందులో పాల్గొనే వ్యక్తుల సంఖ్య, వాహనాల వివరాలు, రూట్ మ్యాప్‌తో సహా ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ర్యాలీలో ఏ ఇబ్బంది తలెత్తినా అందుకు నిర్వాహకుడే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.

నామినేషన్ల స్వీకరణకు సిద్ధం

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 15: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భాగంగా ఈనెల 18 నుంచి వివిధ రాజకీయ పార్టీల నాయకుల నుంచి నామినేషన్లు స్వీకరించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు కాకినాడ రూరల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఇట్ల కిషోర్ తెలిపారు. సర్పవరం జంక్షన్‌లో తహశీల్దార్ కార్యాలయంలోని రూరల్ నియోజకవర్గం ఎన్నికల కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల కోసం ఈనెల 18న గెజిట్ నోటిఫికేషన్ విడుదల అవుతుందని, ఇదే రోజు నుంచి ఈనెల 25 వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందన్నారు. 26న తేదీన నామినేషన్ల పరిశీలన అనంతరం 29వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు.

సిబ్బందికి వసతులు కల్పించాలి

పెద్దాపురం, ఏప్రిల్ 15: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సిబ్బందికి వసతుల కల్పనలు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని ఆర్డీవో జె.సీతారామారావు అధికారులను ఆదేశించారు. ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్లు తమ ఓటుహక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటుహక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల రోజున పూర్తిస్థాయిలో ఏర్పాట్లు ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, వైద్యం తదితర వసతులపై ఆరాతీశారు. స్థానిక లూథరన్ హైస్కూల్లో జరుగుతున్న ఓపీవో శిక్షణా తరగతులను పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్లు కేవీ పద్మావతి, రామారావు, ఎంపీడీవో ఉషారాణీ, డీటీ భానూకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై శిక్షణ

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 15: ఎన్నికల రోజు ఓపీవో(అదర్ పోలింగ్ ఆఫీసర్స్)ల విధులపై సోమవారం కాకినాడ పీఆర్ ప్రభుత్వ కళాశాలలో శిక్షణ జరిగింది. 2రోజులపాటు జరిగే ఈ శిక్షణలో 2400మంది ఓపీవోలకు శిక్షణ ఇవ్వనున్నారు. రోజూ నాలుగు బ్యాచ్‌లుగా విభజించి ఈ శిక్షణ ఇస్తున్నారు. 31మంది మాస్టర్ ట్రైనర్లు వీరికి శిక్షణ ఇస్తారు. ఆర్వో జె.వెంకటరావు, ఏఆర్‌వో చెల్లన్నదొర తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 15: మండలంలోని పెద్దిపాలెంలో అగ్నిపమాదంలో 3 పోర్షన్ల తాటాకిల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన పక్కుర్తి అచ్చిరాజు, లోవరాజు,పక్కుర్తి మాణిక్యంల కుటుంబాలకు బీసీ నాయకుడు గొంప శివ కుమార్‌శివకుమార్ సోమవారం రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. 50 కిలోల బియ్యం, 2నెలలకు సరిపడా కిరాణా అందజేశారు.

వలంటీర్ల రాజీనామా

గొల్లప్రోలు రూరల్/పిఠాపురం, ఏప్రిల్ 15: గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని 3 సచివాలయాల పరిధిలోని 72మంది గ్రామ వలంటీర్లు తమ పదవులకు రాజీనామా చేశారు. వీరు తమ రాజీనామాలను ఆయా సచివాలయ అడ్మిన్‌లకు అందజేశారు. అలాగే పిఠాపురం పట్టణంలోని వార్డు సచివాలయం పరిధిలో 12మంది, 3,5,6 సచివాలయాలు నుంచి ఒక్కొక్కరు వంతున 15మంది వార్డు వలంటీర్లు రాజీనామా చేశారు. వారి రాజీనామాలను ఆమోదించి ఉన్నతాధికారులకు నివేదించామని కమిషనరు కనకారావు తెలిపారు.

పెద్దాపురం: పట్టణ పరిధిలో 21 మంది వార్డు వలంటీర్లు,మండల పరిధిలోని వడ్లమూరు, ఉలిమేశ్వరం, తిరుపతి గ్రామాలకు చెందిన 32 గ్రామ వలంటీర్లు ఉద్యోగాలకు రాజీనామా చేసినట్లు మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, ఎంపీడీవో మాదిరెడ్డి ఉషారాణీ తెలిపారు.

ఏలేశ్వరం: ఏలేశ్వరంలో 60మంది వలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్‌కు అందజేశారు.

మత్స్యకార గ్రామాల్లో రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు

జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు

పిఠాపురం, ఏప్రిల్ 15: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మత్స్యకార గ్రామాల్లో రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు చర్యలు చేపడతామని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు తెలిపారు. పార్టీ మత్స్యకార విభాగం, కొత్తపల్లి మండల నాయకులు సోమవారం పిఠాపురంలో నాగేంద్రబాబును కలిశారు. ఫార్మా కంపెనీల వల్ల వచ్చే వ్యర్థాలతో సముద్రపు నీరు కలుషితమవుతున్నదని, ఓఎన్‌జీసీ కంపెనీ ఆయిల్ తీత కారణంగా మత్స్య సంపద తగ్గిపోతుందని నాగబాబు దృష్టికి తీసుకువచ్చారు. వేట నిషేధం సమయంలో మత్స్యకారులకు జీవన భృతి చెల్లించాలని నాగబాబు డిమాండ్ చేశారు. సముద్రతీర ప్రాంత గ్రామాల్లో మత్స్యకారుల సంక్షేమం, భద్రతకు కనీస చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మత్స్యకార వికాస విభాగం అధ్యక్షుడు మల్లాడి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంక కొండబాబు, అమల, సోదే రవికిరణ్, సూరాడ శ్రీను, పల్లేటి దేవుడు, సింహాద్రి, మెరుగు ఇజ్రాయిల్ తదితరులు ఉన్నారు.

రైల్వేస్టేషన్లో విస్తృతంగా తనిఖీలు

సామర్లకోట, ఏప్రిల్ 15: సామర్లకోట రైల్వేస్టేషన్లో సోమవారం రైల్వే పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మూడు ప్లాట్‌ఫామ్స్, ప్రయాణికుల విశ్రాంతి మందిరాలు, వీఐపీ అతిథిగృహాలు, పార్శిల్ కార్యాలయం, ఐఆర్‌సీటీసీ తదితర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సామర్లకోట చేరుకున్న ఎక్స్‌ప్రెస్ రైలులోని పలు బోగీలను, ప్రయాణికుల సామాగ్రిలను తనిఖీ చేశారు. రైల్వే పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గౌస్‌బేగ్, సామర్లకోట రైల్వే ఎస్ఐ బొట్టా లోవరాజు తదితరులు పాల్గొన్నారు. సార్వత్రిక ఎన్నికల నేప థ్యంలో నిబంధనల ప్రకారం నగదు, మద్యం తదితర మత్తు పదార్థాల అక్రమ రవాణాలను పూర్తిస్థాయిలో నిరోధించేం దుకు రైల్వే స్టేషన్లలో పోలీసు నిఘా విస్తృతం చేసామని గౌస్‌బేగ్ తెలిపారు. అనుమానిత ప్రయాణికుల లగేజీ సా మాగ్రిలను సైతం తనిఖీలు నిర్వహించనున్నందున ఎవరూ అక్రమ రవాణాకు పాల్పడరాదని హెచ్చరించారు. సామర్లకోట రైల్వే సూపరింటెండెంట్ ఎం.రమేష్, రైల్వే అధికారులు ఉన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


ఈవోకు రూ.లక్ష విరాళం అందిస్తున్న దాత

పిఠాపురం, ఏప్రిల్ 15: పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో నిత్యాన్నదాన పథకానికి పట్టణానికి చెందిన బొండా సుబ్బారావు రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. తన తాత నానమ్మలు బొండా సుబ్బారావు, సూర్యకాంతం పేరు మీద మహాలయ అమావాస్య రోజు అన్నదానం నిమిత్తం ఈ విరాళ మొత్తాన్ని ఆలయ ఈవో, సహాయ కమిషనరు పులి నారాయణమూర్తికి అందజేశారు. దాతను ఈవో ఆలయ మర్యాదలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్ కేవీ రమణ, అన్నదానం సెక్షన్ గుమస్తా పి.సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు

కాకినాడ క్రైం, ఏప్రిల్ 15: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండోరోజైన సోమవారం అగ్నిప్రమాదాల నివారణపై కాకినాడలోని పలు కూడళ్లలో అగ్నిమాపక సిబ్బంది విద్యార్థులు, స్థానికులకు పలు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. సాలిపేట ఏడీఎఫ్‌వో వి.సుబ్బారావు ఆధ్వర్యంలో సిబ్బంది భానుగుడి జంక్షన్‌లో డెమో కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని గ్యారేజీలో వాహనాలకు సంభవించే అగ్నిప్రమాదాలు వాటి నివారణపై అగ్నిమాపక పరికరాలతో ప్రయోగాత్మకంగా వివరించారు.

తుని రూరల్: తుని రైల్వేస్టేషన్ ప్రాంగణంలో రైల్వే పోలీసులు, అధికారులు, సిబ్బందితో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక విన్యాసాలు ప్రదర్శించడంతో పాటు మాక్‌డ్రిల్‌లో పాల్గొని అగ్నిప్రమాదాల నుంచి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోలనే అంశాలపై అవగాహన కల్పించారు.

1578 ఈవీఎంలు రాక

ప్రత్తిపాడు, ఏప్రిల్ 15: ప్రత్తిపాడు నియోజకవర్గ పోలింగ్‌కు సంబంధించి 1578 ఈవీఎం మిషన్లు సోమవారం ప్రత్తిపాడుకు చేరుకున్నాయి. ప్రత్యేక వాహనంలో పోలీస్ బందోబస్తు మధ్య స్థానిక మినర్వాలోని ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రానికి తరలించారు. వాటిలో బ్యాలెట్ యూనిట్‌లు 544లు, కంట్రోల్ యూనిట్‌లు 590, ఇతర ఈవీఎం మిషన్లు 544 ఉన్నాయి. వాటిని నియోజకవర్గ ఆర్వో ఎ.శ్రీనివాసరావు, ఏఆర్వోలు ఎం.నరసింహారావు, రాజకుమారి పరిశీలించి సీల్ వేసి రూమ్స్‌లో భద్రపరిచే చర్యలు చేపట్టారు. నియోజకవర్గంలోని 227 పోలింగ్‌కేంద్రాల్లో తరలించనున్నట్టు తెలిపారు.

జగ్గంపేట: జగ్గంపేట ప్రభుత్వ మోడల్ డిగ్రీకళాశాలలో ఎన్నికల ఈవీఎంలు భద్రపరిచారు. వైసీపీ రాష్ట్ర సేవా జనరల్ సెక్రటరీ ఒమ్మి రఘురామ్, పార్టీ నాయకులు అత్తులూరి సాయిబాబు, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉన్నారు.

ముగిసిన మహాసభలు

ఏలేశ్వరం, ఏప్రిల్ 15: మండలంలోని సిరిపురంలో నిర్వహించిన శ్రీచిద్గగనానంద గీతాశ్రమంలో నిర్వహించిన 50వ రాష్ట్రస్థాయి భక్తి,జ్ఞాన,వేదాంత మహాసభలు ముగిశాయి. సోమవారం చివరిరోజు కార్యక్రమానికి శ్రీస్వామి సూర్యానందగిరి, శ్రీసాధక్ మహేష్, ఆనంద్ స్వామి, శ్రీదయానంద భారతీస్వామి, శ్రీవిశ్వానం భారతీస్వామి, ఓరుగంటి నరసింహయోగి తదితర ఆశ్రమాల స్వామీజీలు హాజరై గురుదేవుని ఊరేగింపు, అమృత శిలా విగ్రహపూజతోపాటు ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. ఆశ్రమ కమిటీ సభ్యులు పొలమూరి పెద్దకాపు, మజ్జూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో పలువురి చేరిక

కరప, ఏప్రిల్ 15: పేపకాయలపాలెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు ఒంటెద్దు వీరబాబు తన అనుచరులతో కలిసి సోమవారం జనసేనపార్టీలో చేరారు. పార్టీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ నాయకులు బోగిరెడ్డి కొండబాబు, గంగాధర్, యాళ్ల పండు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలు

తుని రూరల్, ఏప్రిల్ 15: శ్రీప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించగా బీఎస్సీ, బీకాం, బీబీఏ చదువుతున్న, పూర్తయిన సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొనగా పలువురు అర్హత సాధించారు. క్యాంపస్ ఇంటర్వ్యూల్లో డిజైన్ ప్రో, రెండ్పడ్, నవతా,అపోలో కంపెనీలు పాల్గొన్నాయి.

మల్లేపల్లిలో గజ్జలపూజ

గండేపల్లి, ఏప్రిల్ 15: మండలంలో మల్లేపల్లి గ్రామంలో నీలికుండీలపేటకు చెందిన సుమారు 60మందికిపైగా చిన్నారులు 2నెలలుగా కోలాటం నేర్చుకున్నారు. సోమవారం రామాలయం ఆవరణలో గజ్జల పూజ కార్యక్రమం నిర్వహించి గ్రామస్తుల సమక్షంలో తొలి కోలాట ప్రదర్శన ఇచ్చారు.

చలివేంద్రం ప్రారంభం

గండేపల్లి, ఏప్రిల్ 15: మండలంలో మల్లేపల్లిలో జాతీయ రహదారి పక్కన గ్రామానికి చెందిన దుమ్మా వెంకటరాజు జ్ఞాపకార్థం కుమారుడు శ్రీను చలివేంద్రం ప్రారంభించారు. బాటసారులకు మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు.